# కొంకు

- సత్యం ఆదూరి

కొంకుని చిన్నప్పటి నుంచి నేనే పెంచాను. నాతో పాటు నా కుటుంబ సభ్యులంతా కూడా కొంకును చాలా ఆదరాభిమానాలతో చూసేవారు. కొంకుకు చిన్నప్పటి నుంచి నేను, నా పిల్లలు చాలా విద్యలు నేర్పాము.

ప్రొద్దుటే లేవగానే బుట్ట పట్టుకుని పాలబ్బాయి వద్ద కెళ్ళి పాలు తెస్తుంది మా కొంకు. మేమంతా కాఫీ త్రాగి దానికి పాలు యిచ్చేవాళ్ళం.

కొంకుకి తెలియని పనంటులేదు. లిస్టు రాసిస్తే కొట్టుకెళ్లి కూరలు తేవడం, సరుకులు తేవడం నేర్చుకుంది.

ఒకరోజున మా యింటికి కొంతమంది చుట్టాలొచ్చారు. వారికి అతిథి సత్కారాల్లో భాగంగా టిఫిన్ పెట్టాము. కొంకు వారి దగ్గర కొచ్చి తనక్కూడా పెట్టమని అడగడం మొదలెట్టింది. అలా చేయకూడదని నేను మందలించాను. శేష జీవితంలో మరెప్పుడూ అలాంటి తప్పు చేయలేదు కొంకు !

నా పిల్లలు స్కూలుకు వెళ్తే వాళ్ళతో బస్‌స్టాండ్ వరకు వెళ్లి వాళ్లను సాగనంపి తిరిగి వస్తుంది. వీళ్లంతా తిరిగి సాయంత్రం యింటికి వచ్చే వేళకి గుమ్మం దగ్గర ఎదురుచూస్తూ సాదరంగా ఆహ్వానించేది.

ఒక సారి కొంకు అల్లరి చాలా చేసింది. ఆ అల్లరి మేము తట్టుకోలేనంతగా చేసింది. మా పెద్దబ్బాయి ఆఫీసులో దాన్ని పదిహేను కిలోమీటర్ల దూరంలో వదిలి వచ్చాడు. అలా చేసినందుకు మేమంతా చాలా బాధ పడ్డాము. మా చిన్నాడైతే రెండు రోజులు అన్నం ముట్టలేదు.

మూడో రోజు రాత్రి కొంకు మా యింటికి తిరిగి వచ్చేసింది ! మా ఆశ్చర్యానికి అంతులేదు.

మా చిన్నాడి ఆనందానికి అవధుల్లేవు. దానికి అన్నం పెట్టి తను కూడా తిన్నాడు. వాడి దిగులు మటుమాయమైంది.

కొంకుకి మాయింటి ప్రక్క వాళ్ళతో కూడా పరిచయం ఎక్కువ. వాళ్లు కూడా దాన్ని చాలా గారంగా చూసుకునేవారు.

ఒక రోజున మా ప్రక్కింటి వారి అబ్బాయి రెండేళ్ల వయసు వాడు - నీళ్ళ బక్కెట్టు వద్దకు వెళ్ళి ఆ బక్కెట్టులో పడి గిల గిలా కొట్టుకుంటూ వుంటే కొంకు వెంటనే వెళ్ళి ఆ పిల్లవాణ్ణి రక్షించేందుకు బక్కెట్టును ఒక్క తన్ను తన్ని బోల్తా కొట్టింది. కొంకు తన బిడ్డను ఏదో చేసిందని మొదట అనుకున్నా, తర్వాత అసలు విషయం తెలుసుకుని చాలా బాధపడింది మా పక్కింటావిడ. ఆ రోజు ఆ అబ్బాయి పుట్టిన రోజు. తన బిడ్డను రక్షించినందుక్కు కొంకుకు బహుమతిగా చక్కటి డ్రెస్ కుట్టించిందావిడ.

ఇంటి కొచ్చిన చుట్టాలందర్ని బస్‌స్టాండ్ వరకు సాగనంపితే కాని కొంకుకు మనసొప్పేది కాదు. ఒక రోజున నాల్గు ఫర్లాంగలు వెళ్ళి అరగంట సేపు చుట్టాలతో కాలక్షేపం చేసి వాళ్లను బస్సెక్కించి తిరిగొచ్చింది కొంకు.

నేను ఎక్కువగా టూర్లు చేస్తుంటాను. నేనెప్పుడు టూరు కెళ్ళినా కొంకు నాతో పాటు ప్రయాణ మయ్యేది - ఇంక వెళ్ళిపోలే బాబూ - మెయిన్ రోడ్డొచ్చింది - ఏ బండిక్రిందైనా పడ్తావేమో' అనేవాణ్ణి. ఐనా వినిపించుకొనేది కాదు. నన్ను సొంతం బస్కెక్కించాక తిరిగి యింటికి వెళ్ళేది.

కొంకుకి నేనంటేఅమితమైన ప్రేమ. నేను వూళ్ళో లేనంత కాలం దానికి దిగులెక్కువ. నేను టూరు నించి రావడం మేడమీంచి చూసి ఫర్లాంగు దూరం ఎదురొచ్చి నిలువెత్తునా నామీద పడిపోయినన్ను సాదరంగా యింటికి తీసుకు వెళ్లేది నా కొంకు !

కొంకు తన చాకచక్యంతో రెండు సార్లు మా యింట్లో దొంగలు పడకుండా కాపాడింది.

కొంకుకి ఒక రోజున కొద్దిగా జ్వర మొచ్చింది. మాచిన్నాడికి అదంటే అమితమైన ప్రేమ. ఎప్పుడూ వాడు దాన్ని తన ప్రక్కలో పడుకో బెట్టుకునే వాడు. అభిమానం ఎంత ఎక్కువంటే కొంకుకు జ్వరమొస్తే తనక్కూడా జ్వరమొచ్చేది. రెండు రోజుల తర్వాత కొంకుకు మా చిన్నాడికి కూడా ఒకేసారి పత్యం పెట్టాము.

మేము మా యిల్లు అమ్మేశాము. ఆ తర్వాత చాలా దూరంగా వెళ్ళిపోయాము. అద్దె కొంప మూలాన కొంకును తీసుకెళ్ళే స్థితి లేక దాన్ని పాతింట్లోనే వదిలేశాము. అడపా దడపా ఆయింటికి వెళ్ళినపుడు కొంకు మమ్మల్ని వదలి పెట్టేది కాదు.

"ఊ ...... ఊ" అని అరుస్తు, మమ్మల్ని నఖశిక పర్యంతం తాకేది. దాని ఆప్యాయం అలాంటిది !

మా యిల్లు కొనుక్కున్న వాళ్ళు, మా యిరుగు పొరుగు వారు కూడా మేము వెళ్ళిపోయాక కొంకుని ఆప్యాయతగా చూసేవారు. వాళ్లందర్కి సేవచేస్తూ ఆదర్శంగా నిల్చిపోయింది. మా కొంకు.

కొంకుకి చివరి దశలో చాలా జబ్బు చేసింది. దానికి కళ్ళు సరిగ్గా కనిపించకపోతే మా చిన్నాడు 'కేటరాక్ట్' ఆపరేషన్ చేయించాడు. ఆ తర్వాత దానికి ఎంతో గొప్ప వైద్యం చేయించాము. ఆఖరి క్షణాల్లో దానికి ఆక్సిజన్ కూడా పెట్టారు. కాని ఫలితం దక్కలేదు. పదమూడు సంవత్సరాల కొంకు యిక మాకు లేదు. అది మరణించాక దాన్ని భూస్థాపితం చేసి మేమంతా స్నానాలు చేసి మా యింటికి తిరిగి వచ్చాము.

ఇంతకీ ఆ కొంకు ఎవరనుకున్నారు ..... మా కుక్కపిల్ల !

పదమూడేళ్ళ క్రితం మా గృహప్రవేశం నాడు ప్రక్కనే ఉన్న గుట్టమీద ఒక కుక్కపిల్ల పుట్టింది. అదే రోజున ఆ కుక్కపిల్లను తీసుకొచ్చి - 'బొద్దుగా ముద్దుగా వుంది నాన్నా - మనం పెంచుకుందాం' అని మారాం చేశాడు మా చిన్నాడు. మేమంతా దాన్ని పెంచేందుకు యిష్టపడ్డాము. కొండమీద దొరికిన కుక్కపిల్ల కాబట్టి ఆ మొదటి రెండక్షరాలు కలిపి దానికి నేను 'కొంకు' అని నామకరణం చేశాను.

మూగజీవులలో ఆణిముత్యం మా కొంకు. దాని పుట్టిన రోజు పండుగకు దాని ఫోటో ముందు మాతో పాటు 'టింకు' కూడా కాళ్ళు ముడుచుకుని చూస్తూ కూర్చుంటుంది

కొంకు మాకు చేసిన సేవలకు గుర్తుగా దానికి పుట్టిన పిల్లలలో ఒక మంచి మొగకుక్కపిల్లను తిరిగి తెచ్చుకుని ప్రస్తుతం సేవలు చేస్తూ మా అందరి ఆదరాభిమానలు చూరగొంది యీ 'టింకు'



అది 'కాలం చేసిన రోజున మాతో పాటు విగాలుగా కూర్చుంటుంది !

మా కుటుంబంలో కుక్కల్ని పెంచడమన్న అలవాటు చాలా కాలంగా వుంది. నలభై ఏళ్ళ క్రితం మేమొక కుగ్రామంలో వుండేవాళ్ళం, నా తల్లికి జీవకోటిపై అభిమానం ఎక్కువ. అందువల్ల మా యింటికి ఒక నల్లకుక్కపిల్ల చాలా చిన్నప్పుడు చేరింది. దానికి 'ముస్లి' అని పేరు పెట్టాము. ఆ తర్వాత మరి మూడు కుక్కలు కూడా జేరాయి. మాకున్నంతలో వాటికి కూడా రెండు పూట్లా అన్నం పెట్టే వాళ్ళం. ఆ వూళ్ళో మేము పదేళ్ళు వున్నాము. ఆ పదేళ్ళూ యీ కుక్కలన్నీ అతి విశ్వాసంతో మాతోటే వున్నాయి. ఆ తర్వాత నేను ఉద్యోగ రీత్యా హైద్రాబాదులో స్థిర పడ్డాను. ఉద్యోగం వచ్చిన కొద్ది కాలానికి నా కుటుంబ సభ్యులందర్నీ ఆకుగ్రామం నుండి హైద్రాబాద్ తీసుకు వచ్చాను. దాదాపు యిరువది కిలోమీటర్లు మేమంతా మా సామాన్లతో రెండు రెండెడ్ల బళ్ళలో ప్రయాణం చేసి దగ్గర రైల్వేస్టేషన్‌కు జేరాము.

ఆ సమయంలో మానాల్గు కుక్కల ఆవేదనా వర్ణనా తీతము. యిరవై కిలోమీటర్ల దూరం మావెన కాలేనడుచుకుంటూ, కంట నీరు పెట్టుకుని, వచ్చాయి. ఒక సమయంలో మా తల్లిగారు "ఉద్యోగ రీత్యా వూరు వదలి పోతున్నాము. వెనక్కి వెళ్ళండే" - అని ఎంత వారించినా అవి వెనుతిరగలేదు. మేము రైలెక్కాక మాత్రమే అవి తిరిగి మా కుగ్రామం వెళ్ళిపోయాయి. ఈ ఎనలేని ప్రేమకు మా అందరి నేత్రాలు అశ్రు పూరితాలయ్యాయి.

విశ్వాసంలేని పది మంది మనుషుల కన్న ఎనలేని సేవలందించిన ఒక్క 'కొంకు' మిన్న !

✤

ఈనాడు మానవుడు, అనేక శాస్త్రాల్ని అధ్యయనం చేస్తున్నాడు. సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాల గురించి అవగాహనను కలిగి వుంటున్నాడు. ఈనాటి ప్రపంచం సంక్షోభాలకు నిలయం. సమస్యలు గానీ, సంక్షోభాలు గానీ మనిషి ఆలోచనా విధానం నుండే ఉత్పన్న మవుతాయి. సక్రమమైన ఆలోచనా విధానం అలవడ నప్పుడు మన చుట్టూ వున్న ప్రపంచం కూడా సక్రమంగా ఉండదు. మనిషి ప్రవర్తనను అతని ఆలోచనా రీతిని అంచనా వేయటానికి మనో విజ్ఞాన శాస్త్రం తోడ్పడినట్టుగా మరే శాస్త్రం తోడ్పడజాలదు. మనో విజ్ఞానం గురించి తెలుసుకున్న వ్యక్తి తనని తాను విశ్లేషించుకోవటమే గాక, ఎదుటి వారి ప్రవర్తనను విశ్లేషించ గలుగుతాడు. దీని వలన చాల సమస్యలకు పరిష్కార మార్గాలు తెలుసుకోగలుగుతాడు. కాబట్టి ప్రతి వ్యక్తి మనో విజ్ఞానం గురించి తెలుసుకొని తీరాలి. ఈ శాస్త్రంలో ఆసక్తికలవారు, విపులంగా చెప్పగలవారు ఆంధ్రదేశంలో ఎందరో ఉన్నారు. దయచేసి వీరంతా తాము పాఠకులకు తెలియ చెప్పదలచిన మనో విజ్ఞాన శాస్త్రాన్ని వ్యాసరూపంగా రాసి పంపమని మనవి చేస్తున్నాం. ఎన్నికైన వ్యాసాలను ఆహ్వానం ఏప్రిల్ జన్మదిన సంచికలో ప్రచురిస్తాం. వ్యాసం అచ్చులో 3,4 పేజీలకు మించరాదు. మార్చి 4,5 తేదీల్లోగా వ్యాసాలు మాకు అందవలసి వుంటుంది.

– ఎడిటర్

ఆహ్వానం "జన్మదిన సంచిక"
ప్రత్యేక"అను బంధంగా
సైకాలజీ స్పెషల్
'మనిషి – మనసు'
అందిస్తున్నాం.

– ఎడిటర్